
సాక్షి బాపట్ల

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



కావురమ్మకు ప్రత్యేక పూజలు

రేపల్లె రూరల్: చెరుకుపల్లి మండలం కావూరులోని కావురమ్మ తల్లి తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ ఈవూరి గణేష్ ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 514.60 అడుగుల వద్ద ఉంది. ఇది 139.6134 టీఎంసీలకు సమానం.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంకరోడ్డులోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం నాలుగో వార్షికోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు.

న్యూస్‌రీల్

నేడు ప్రత్యేక గ్రీవెన్స్

బాపట్ల: ఎస్టీలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌ను ప్రతినెలా మూడవ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలు విన్నవించుకోవడానికి జిల్లాలో దివ్యాంగులు, ఎస్టీలు ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్‌కు రావచ్చన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని ఎస్టీలు, దివ్యాంగులు గమనించి, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్తమ జెడ్పీటీసీ సభ్యురాలిగా 'యార్లగడ్డ'



కారంచేడు: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉత్తమ జెడ్పీటీసీ సభ్యురాలిగా కారంచేడు జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఒంగోలు మల్లయ్య లింగం భవన్ నందు నిర్వహించబోయే ప్రత్యేక కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని తనకు ఆహ్వానం అందినట్లు ఆమె తెలిపారు.

బొప్పూడి ఆలయంలో సీతారామ కళ్యాణం



చిలకలూరిపేట: బొప్పూడి గ్రామం డొంక వద్ద జాతీయ రహదారి పక్కన వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ 42వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో సీతారామ కళ్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మురికిపూడి సంతోష్ చరణ్ దివి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొండపాటూరు పోలేరమ్మకు రూ. 22.46 లక్షల ఆదాయం



ప్రత్తిపాడు: కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మకు తిరునాళ్ల సందర్భంగా రూ. 22.46 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బత్తుల సురేష్‌బాబు తెలిపారు. భక్తులు పోలేరమ్మ తల్లికి సమర్పించిన కానుకలు, హుండీలను తెరిచి ఆలయంలో గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పాటల ద్వారా రూ. 3.90 లక్షలు, హుండీల ద్వారా 12.76 లక్షలు, టిక్కెట్ల ద్వారా 2.40 లక్షలు, చందాల రూపంలో రూ. 39 వేలు, లడ్డూ ప్రసాద విక్రయాల ద్వారా రూ. 3 లక్షలు చొప్పున మొత్తం 22,46,256 రూపాయల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయశాఖ బాపట్ల ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి, ఈవో బి. సురేష్‌లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మువ్వా రామచంద్రావు, గ్రామపెద్దలు యర్రాకుల దానయ్య, పి. శ్రీనివాసరావు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లికి మంగళంపై ఆగ్రహం

- ఏడాది పాలన ముగుస్తున్నా ఇప్పటికీ ఒక్క రూపాయి ఇవ్వని వైనం
- బిడ్డలను చదివించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్న తల్లిదండ్రులు
- చేతకానప్పుడు హామీ ఇవ్వడమెందుకంటూ ఆగ్రహం
- ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్
- సాక్షి గ్రౌండ్ రిపోర్ట్‌లో సర్కార్‌పై పేద కుటుంబాల ఆగ్రహం

'తల్లికి వందనం' ఎప్పుడంటూ ప్రశ్నిస్తున్న జనం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

'నీకు పదైదు వేలు..నీకు పదైదు వేలు, నీకు పదైదు వేలు..ఇంట్లో ఒక్కరున్నా ఇద్దరున్నా..ముగ్గురున్నా.. చివరకు నలుగురున్నా సరే ఒక్కొక్కరికీ పదైదు వేలు ఇస్తాం.' సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్‌బాబు, పవన్ కల్యాణ్, ప్రస్తుత ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు సహా కూటమి నేతల ఆర్భాటపు హామీ ఇది. ఎన్నికలు ముగిసి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ... ఆ హామీ నెరవేర్చక పోవడంతో పిల్లలను చదివించుకునేందుకు పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు అష్టకష్టాలు పడుతున్నారు. అమలు చేతకానపుడు ఆర్భాటపు హామీలతో వంచించడమెందుకని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు మంగళం పాడటంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఏడాది కావస్తున్నా.. పేద విద్యార్థుల చదువులకు ఎంతగానో ఉపయోగపడే తల్లికి వందనం పథకం అమలు చేయకపోవడంపై పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. జగనన్న ఇచ్చినప్పుడు మీరెందుకివ్వలేరంటూ పచ్చనేతలను నిలదీస్తున్నారు. సర్కార్ వంచన నేపథ్యంలో...బిడ్డలను చదివించుకునేందుకు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు 'సాక్షి' బృందం శని, ఆదివారాల్లో బాపట్ల ప్రాంతంలోని పలు గ్రామాలు, కాలనీలను సందర్శించి విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను పలకరించింది. బిడ్డలను చదివించుకునేందుకు వారు పడుతున్న బాధలను చూసింది. కష్టాలను ఆలకించింది.



జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్తున్న విద్యార్థినులు



హనుమంతనగర్

మోసగించడం సరికాదు..



చొక్కా కాంతమ్మ కుటుంబం

సూర్యలంకకు చెందిన చొక్కా దారబాబు, కాంతమ్మలకు సాయిదుర్గ, మేరీ, చరణ్, హర్ష నలుగురు సంతానం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సాయిదుర్గకు అమ్మ ఒడి ఇచ్చి చదువుకు సాయమందించారు. ఇప్పుడు తల్లికి వందనం ఎంతమంది వుంటే అంతమందికిస్తామని ఓట్లేయించుకున్న కూటమి ప్రభుత్వం పైసా ఇవ్వలేదని దారబాబు కుటుంబం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇచ్చే మనస్సులేనపుడు హామీలివ్వడం ఎందుకని నిలదీస్తోంది. ప్రజలను మోసగించడం సరికాదంది.

ఆవేదన.. ఆగ్రహం

వీరేకాదు... ఎస్టీకాలనీకి చెందిన ఏడు కొండలు, సత్యవతి, చెంచుపున్నయ్య, భవానీ, ఆదర్శనగర్‌కు చెందిన శ్రీనివాసరావు, స్వప్న, రామానగర్‌కు చెందిన కొక్కిలిగడ్డ దాసుబాబు, రేవతితోపాటు పదుల కుటుంబాల పేదలు బిడ్డలను చదివించుకునేందుకు పడుతున్న కష్టాలను ఏకరువు పెట్టారు. కూటమి సర్కార్ తల్లికి వందనం హామీ నమ్మి మోసపోయామంటూ వాపోయారు.

'అన్నీ ఇవ్వాలి కదా సార్..'

ముత్తాయిపాలెం జెడ్పీ పాఠశాలవద్ద రామానగర్, ఆదర్శనగర్, ముత్తాయిపాలెంలకు చెందిన పలువురు విద్యార్థులను పలకరించింది 'సాక్షి' బృందం. తల్లికి వందనం వేయకపోవడంవల్ల మాలాంటి పేదకుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వారు వాపోయారు. జగనన్న ఉన్నప్పుడు డబ్బులతోపాటు బట్టలు, బూట్లు, ట్యాబ్‌లు అన్నీఇచ్చారన్నారు. 'ఇస్తామని చెప్పి ఓట్లేయించుకున్నాక అవన్నీ ఇవ్వాలి కదా సార్ ..మాట తప్పకూడదు కదా' అని కూటమి ప్రభుత్వం తీరును తప్పుబట్టారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇలా..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమ్మ ఒడి పేరుతో ఇంటికొక బిడ్డకు ఏడాదికి రూ. 15 వేలు తల్లుల ఖాతాల్లో జమచేశారు. పాఠశాల ఫీజులతో పాటు పిల్లలకు బట్టలు, బూట్లు, ట్యాబ్‌లు ఇచ్చారు. రూ. వేలకోట్లు ఖర్చుపెట్టి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను సమకూర్చారు.

వైఎస్ జగన్ ప్రభుత్వం జిల్లాలో ఇచ్చిన అమ్మఒడి వివరాలు

విద్యాసంవత్సరం	లబ్ధిదారులు	మొత్తం (రూ. కోట్లలో)
2019-20	1,14,550	171.82
2020-21	1,16,019	162.42
2021-22	1,19,953	155.94
2022-23	1,17,827	176.75

లక్షలాదిమంది తల్లుల ఎదురుచూపులు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1417, ప్రైవేట్ పాఠశాలలు 413 ఉండగా ఆయా పాఠశాలల్లో గతేడాది గణంకాల ప్రకారం 1.92 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కూటమి సర్కార్ హామీ ఇచ్చినట్లు ఇంటికి నలుగురికి కాకపోయినా సగటున ఇద్దరికి ఇచ్చినా మూడు లక్షలమంది పైచిలుకు విద్యార్థులకు తల్లికి వందనం ఇవ్వాల్సివుంది.

'పేదోళ్లకిచ్చే సాయం ఎగ్గొడితే ఎలా సారూ..'

బాపట్ల శివారులోని సూర్యలంక రోడ్డులో ఉన్న నిరుపేద హనుమంతు నగర్ ఎస్టీ కాలనీఅది. పాతకాలపు ఇళ్లతో కాలనీ దర్శనం ఇస్తుంది. ఇదే కాలనీలో ఉంటున్న బొజ్జా గోవిందు, నారాయణమ్మలకు తొమ్మిదేళ్ల గంగ, లీలావతి కవలలతోపాటు ఐదు సంవత్సరాల ప్రజ్ఞేష్‌తో కలిపి ముగ్గురు సంతానం. చెమటోడ్చితేగానీ రెండు పూటలా కడుపు నింపుకోలేని స్థితి. పిల్లలకు నాయినమ్మను కాపలాగా పెట్టి చీకటితోడుగా కూలీపనులకు వెళ్లిపోయారు భార్యా భర్తలు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను వివరించి కన్నీళ్లు పెట్టింది వృద్ధురాలు సుబ్బరామమ్మ. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి డబ్బులిస్తామని చెప్పి చంద్రబాబు ప్రభుత్వం పైసా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేసింది. గెలిచాక పేదోళ్లకిచ్చే సాయం ఎగ్గొడితే ఎలా సారూ అని కూటమి సర్కార్‌ను నిలదీస్తోంది. జగన్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకొని డబ్బులిచ్చినప్పుడు చంద్రబాబు ఎందుకివ్వరని కోపంగా ప్రశ్నించింది. ఇది మోసమేనని తేల్చి చెప్పింది.



తల్లికివందనం కోసం ఎదురుచూస్తున్న బొజ్జా గోవిందు కుటుంబం

ఎస్టీల గృహ నిర్మాణాలకు ఆర్థికసాయం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద లబ్ధిదారులైన ఎస్టీల గృహ నిర్మాణాలకు ఆర్థికసాయం అందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన హాబిటాట్ ఫర్ హ్యుమానిటీ ఇండియా బృందం గురువారం బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి చర్చించింది. సమాజంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం గూడు కల్పించడం సంతోషదాయకమని కలెక్టర్ చెప్పారు. ఆర్థిక స్తోమత లేక చాలామంది అర్ధంతరంగా గృహ నిర్మాణాలను నిలిపివేసిన విషయాలను బృందంతో కలెక్టర్ చర్చించారు. అత్యంత నిరుపేదలైన ఎస్టీల గృహ నిర్మాణాలకు తమ సంస్థ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని హాబిటాట్ ఫర్ హ్యుమానిటీ ఇండియా డైరెక్టర్ జస్టిన్ జెబాకుమార్ తెలిపారు. బహుళ జాతి కార్పొరేట్ సంస్థల సహకారంతో ఎస్టీలకు సహాయం చేయాలని తమ సంస్థ నిర్ణయం తీసుకుందని వివరించారు. అనంతరం బాపట్ల పట్టణంలోని తూర్పు లేఅవుట్‌ను కలెక్టర్‌తో పాటు బృందం సభ్యులు సందర్శించారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వై.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



బృందం సభ్యులతో సమావేశమైన కలెక్టర్ జె.వెంకట మురళి

ఐఎఫ్‌సీ బృందం క్షేత్ర సందర్శన

అమరావతి: మండలంలోని పలు గ్రామాలలో గురువారం అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) ప్రతినిధుల బృందం రైతులతో వ్యవసాయ క్షేత్ర సందర్శన, గ్రామసభలు నిర్వహించారు. తొలుత ఈ బృందం దిడుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి మిర్చి రైతులను మిర్చి ఉత్పత్తి, మార్కెటింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు అత్తలూరులో నిర్వహించిన వ్యవసాయక్షేత్ర సందర్శనలో మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. అనంతరం స్వయం సహాయక మహిళాసంఘాల సభ్యులు, రైతులతో ఆర్థిక అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌సీ బృంద సభ్యులు కె. విజయశేఖర్, హేమేంద్ర మెహర్, యువరాజ్ అహూజా, నవనీత్‌రాయ్, షెనాయ్ మ్యాథ్యు, ఇషాసర్, సీతల్ సోమనిలతో పాటు ఉద్యానవన శాఖ డీపీఎం అమలకుమారి, మండల, వ్యవసాయశాఖాధికారి అహ్మద్, ఉద్యాన అధికారి శ్రీనిత్య, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



నాటకాలను బతికించుకుందాం

- గ్రామీణ ప్రాంతంలో పరిషత్తు నిర్వహణ సాహసమే
- 3150 రోటరీ జిల్లా గవర్నర్ కె.శరత్ చౌదరి

మార్టూరు: సామాజిక రుగ్మతల పరిష్కారాలకు దివ్య ఔషధం నాటకమని సమష్టి కృషితో వాటిని బతికించుకోవాల్సిన అవసరం ఉందని 3150 రోటరీ జిల్లా గవర్నర్ కె.శరత్ చౌదరి పిలుపునిచ్చారు. మార్టూరు మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో గురువారం రాత్రి రోటరీ శ్రీకారం కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 15 సంవత్సరాలుగా మార్టూరులో పరిషత్ పోటీలు నిర్వహించటం అభినందించదగ్గ విషయమని అందులో మార్టూరు రోటరీ క్లబ్ భాగస్వామ్యం కావటం తనకు గర్వంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జేవీ మోహనరావు, శ్రీకారం స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు ఇతర రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'కపి రాజు'

శ్రీకారం రోటరీ కళాపరిషత్ రాష్ట్రస్థాయి నాటికల పోటీలలో భాగంగా మొదటి ప్రదర్శనగా న్యూస్టార్ మోడరన్ థియేటర్ విజయవాడ వారి 'కపి రాజు' నాటికను ప్రదర్శించారు. డబ్బు వలన ఆత్మీయుల మధ్య పెరుగుతున్న అంతరాల గురించి నటులు హృద్యంగా చూపించారు. ఎం.ఎస్. చౌదరి రచించి దర్శకత్వం వహించిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది.



కపిరాజు నాటిక లోని ఓ దృశ్యం

నేటి ప్రదర్శనలు

కళాపరిషత్తులో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి 7.30 గంటలకు మొదటి నాటికగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటికను ప్రదర్శించనున్నారు. ఎనిమిదిన్నర గంటలకు శ్రీ చైతన్య కళా స్రవంతి విశాఖ వారి(అ)సత్యం నాటిక, 9:30 గంటలకు కళానికేతన్ వీరన్నపాలెం వారి ఋతువు లేని కాలం నాటిక ప్రదర్శించన్నారు.

నిజాయితీ విలువను చాటిన 'గురితప్పిన వేట'

రెండవ ప్రదర్శనగా రసరుచి ఆర్ట్స్ పొన్నూరు వారి 'గురితప్పిన వేట'నాటికను ప్రదర్శించారు. డబ్బు ఎలా సంపాదించారని కాకుండా ఎంత సంపాదించారని మాత్రమే చూసే నేటి సమాజంలో డబ్బు సంపాదనకు అక్రమార్గాలే దగ్గరి దారని భావించే వారికి నిజాయితీ విలువను చాటి చెబుతూ కనువిప్పు కలిగించే ప్రయత్నం చేశారు నటీనటులు. పిన్నమనేని మృత్యుంజయరావు రచించిన ఈ నాటికకు దర్శకుడైన వై.ఎస్. క్రిష్ణేశ్వరరావు తాత పాత్రధారిగా నటించి తన పాత్రకు న్యాయం చేశారు.



మాట్లాడుతున్న కె.శరత్ చౌదరి

న్యాయవాదుల తీరును ప్రశ్నించిన '27వ మైలురాయి'

న్యాయ న్యాయవాదుల లోపాలపై సంధించిన నాటిక యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి '27 వ మైలురాయి'. కొంతమంది న్యాయవాదులు న్యాయాన్ని బతికించటం కోసం కాకుండా తమ ఆదాయాల కోసం మాత్రమే ప్రాధాన్యత నిస్తూ తప్పుడు కేసులు వాదిస్తున్న లాయర్ల తీరును ఈ నాటికలోని పాత్రధారులు సూటిగా ప్రశ్నిస్తారు. గతంలో తాను వాదించిన ఓ తప్పుడు కేసులో తన ద్వారా శిక్ష పడిన ఓ కుటుంబం ఎంతటి క్షోభ అనుభవించింది దాని తాలూకు ఫలితాలను ఆ న్యాయవాది కుటుంబం ఎలా ఎదుర్కోవాల్సి వచ్చింది అనే విషయాన్ని నటీనటులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. పి. టి.మాధవ్ రచించిన ఈ నాటికకు ఆర్ వాసు దర్శకుడు. నాలుగవ ప్రదర్శనగా స్థానిక శ్రీకారం రోటరీ కళాపరిషత్తు వారు '50 కోట్లు... ఆ తరువాత' అనే ఎగ్జిబిషన్ ప్లేను ప్రదర్శించారు. జె వి.మోహనరావు రచించిన ఈ నాటికకు ఎస్.జయరావు దర్శకత్వం వహించారు.

భావన్నారాయణ స్వామి దేవాలయం వారసత్వ బైలాస్‌కు శ్రీకారం

బాపట్ల: శ్రీభావన్నారాయణ స్వామి దేవాలయం దేవాలయ కట్టడాల పరిరక్షణకు అవసరమైన వారసత్వ బైలాస్ రూపొందిస్తున్నామని 'ఇంటాక్,' (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) జాతీయ వారసత్వ డైరెక్టర్ ఎ.విజయ చెప్పారు. గురువారం ఢిల్లీ నుంచి వచ్చిన ఇంటాక్ బృందం దేవాలయాన్ని సందర్శించింది. ఇటువంటి చారిత్రక దేవాలయాల అద్భుత వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆర్కిలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా వారితో కలిసి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. దేవాలయం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఉన్న పలు వారసత్వ కట్టడాలను వారు సందర్శించారు. ఇందులో భాగంగా శ్రీపాద, నోరి, కంభంపాటి, దేశరాజు వారి భవనాలను వారు పరిశీలించారు. దేవాలయంతో పాటు, మిగతా వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆమె వివరించారు. ఇంటాక్ బృందంలో విజయతో పాటు, ఆర్కిటెక్ కన్జర్వేషనిస్ట్ దీప్తి శర్మ, ఇంటాక్ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఆర్కిలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు చెందిన డి.ఫణీంద్రలు ఉన్నారు. వారికి ఇంటాక్ బాపట్ల జిల్లా కన్వీనర్ డాక్టర్ పీసీ సాయిబాబు స్వాగతం పలికారు. బృందం సభ్యులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఫోరం సభ్యులు జి.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, దేవాలయ వంశపారంపర్య ధర్మకర్త దేశిరాజు రమణబాబు, శ్రీరామచంద్రమూర్తి, ఉమాదేవి, రాజేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయంలో ఇంటాక్ బృందం సభ్యులు

క్లుప్తంగా

మహిళలు చదువుకోవాలి

డీఆర్ఓ గంగాధర్‌గౌడ్


మాట్లాడుతున్న డీఆర్ఓ గంగాధర్‌గౌడ్

బాపట్ల: జిల్లాలోని డ్వాక్రా మహిళా సంఘాలలో ఉన్న చదువురాని మహిళలకు, అంగన్‌వాడీ ఆయాలు, పాఠశాలల్లో పనిచేసే వంటవారు, సహాయకులకు సాంకేతిక అక్షరాస్యతను అందించేందుకు చేపట్టిన ఉల్లాస్ కన్వర్జెన్స్ సమావేశంలో డీఆర్ఓ గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ మొదటి విడతగా 15268 మంది నమోదు చేసుకోగా రెండో విడతలో 31228 చదువురాని వారు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మహిళలు చదువుకోవాలని సూచించారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్మోహనరావు, నోడల్ అధికారి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం


సర్పంచ్‌ను అభినందిస్తున్న నాయకులు

అద్దంకి రూరల్: ప్రజలకు విశేష సేవ అందిస్తూ ప్రజాభిమానం పొందిన రామాయపాలెం సర్పంచ్ ఎస్. రామాంజనేయ రెడ్డికి గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఒంగోలులో ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం అందుకున్నారు. రామాంజనేయరెడ్డిని అద్దంకి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకష్ణమూర్తి తదితర నాయకులు అభినందించారు.

గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులు

సుమారు 300 గ్రాముల గంజాయి స్వాధీనం

మంగళగిరిటౌన్: మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు యువకులు గంజాయి కలిగి ఉన్నారని సమాచారం రావడంతో గురువారం 'ఈగల్' టీమ్ పట్టణ పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. ఈగల్ విభాగాధిపతి ఆకే రవికృష్ణ ఆదేశాలమేరకు ఈగల్‌టీమ్ గురువారం మధ్యాహ్నం ఆ యువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు 200 నుంచి 300 గ్రాముల వరకు గంజాయిని, గంజాయిని వినియోగించే త్రిస్ అనే పేరు కలిగిన రోల్స్‌ను స్వాధీనం చేసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.యువకుల్ని విచారించగా మంగళగిరిలో ఓ యువకుడి వద్ద కొన్నామని, అతని వద్ద 4 కిలోల వరకు గంజాయి ఉందని తెలిసింది.

అగ్గి రాజుకుంటే అంతే

● రెండు నియోజకవర్గాలకు ఒకటే అగ్నిమాపక కేంద్రం
● మూడు సంవత్సరాల కాలంలో 236 అగ్నిప్రమాదాలు


అగ్నిప్రమాదాల నియంత్రణను డెమో ద్వారా వివరిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: జిల్లాలో ఏటా వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించి అపార నష్టాన్ని మిగులుస్తున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, కాల్చిపడవేసిన సిగరెట్, బీడీలు, గ్యాస్ సిలిండర్ పేలడం ఇలా కారణం ఏదైనా వేసవిలో ఏదో ఒక చోట అగ్నిప్రమాదం జరుగుతూనే ఉంది. జిల్లాలో బాపట్ల, అద్దంకి, చీరాల, రేపల్లెలలో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. అగ్నిమాపక శకటాలు అంత దూరం నుంచి వచ్చే సరికి నష్టం జరిగిపోతుంది. చీరాల, పర్చూరు నియోజకవర్గాలకు ఒకటే అగ్నిమాపక కేంద్రం ఉంది. పర్చూరు ప్రాంతంలో ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న చీరాల నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేయాలి. మొత్తం ఎనిమిది మండలాలకు చీరాల అగ్నిమాపక కేంద్రమే దిక్కు. అయితే చీరాల అగ్నిమాపక కేంద్రం డబుల్ ఇంజిన్ కేంద్రం అయినా ఒక్క వాహనంతో పాటు మిస్ట్ వాహనం, టూవీలర్ వాహనం ఉంది. దాదాపు 12 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. సామగ్రి కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

గత మూడు సంవత్సరాలలో జరిగిన భారీ అగ్నిప్రమాదాలు ఇవే...

■ 2024లో అక్టోబర్ 19న ఇంకొల్లులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన ప్రమాదంలో రూ.100 కోట్ల వరకు నష్టం జరిగింది.

■ 2025 జనవరి 6న పర్చూరులోని ఓ ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు మహిళలు మరణించారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

■ 2025 ఫిబ్రవరి 6న పర్చూరులోని ఓ టింబర్ డిపోలో అగ్నిప్రమాదం జరగడంతో భారీ నష్టం వాటిల్లింది. టింబర్ డిపోతో పాటు కారు కూడా దగ్ధమైంది.


పర్చూరు టింబర్ డిపోలో జరిగిన ప్రమాదంలో బూడిదైన సామాగ్రి, కారు (ఫైల్)


పర్చూరులో జరిగిన అగ్నిప్రమాదాన్ని పరిశీలిస్తున్న ఆ శాఖ ఉన్నతాధికారి (ఫైల్)

■ 2022–23 లో 78 అగ్నిప్రమాదాలు జరిగి రూ.79.23 లక్షలు నష్టం వాటిల్లగా రూ.1.19 కోట్లు ఆస్తిని రక్షించారు.

■ 2023–24లో 92 అగ్ని ప్రమాదాలు జరగగా రూ.100.95 కోట్లు నష్టం కాగా రూ.151.69 కోట్లు ఆస్తిని రక్షించారు.

■ 2024–25లో 66 అగ్నిప్రమాదాలలో రూ.2.70కోట్లు నష్టం వాటిల్లగా రూ.4.89 కోట్ల ఆస్తిని రక్షించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాన్ని నివారించానికి ముందుగా చేయాల్సిన పనులను వివరిస్తున్నాం. అలానే డెమోల ద్వారా అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు ఏం చేయాలనేది ప్రజలకు వివరిస్తున్నాం. కరపత్రాలతో, ర్యాలీలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– పీవీ రామకృష్ణ, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి...

నూతన అగ్నిమాపక భవనం సాకారమయ్యేనా...?

చీరాల అగ్నిమాపక కేంద్రాన్ని 1959లో నిర్మించారు. ప్రస్తుతం శిథిల భవనం కావడంతో అందులోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఆధునిక హంగులతో నూతన భవనం ఏర్పాటుకు సన్నాహాలు జరిగినా నేటికి అది కార్యరూపం దాల్చలేదు. విశాలమైన స్థలం ఉన్నా నూతన భవన నిర్మాణ పనులు అడుగు ముందుకు కదలలేదు.

■ పెచ్చులూడిపోయిన గోడలతో, చాలీచాలని గదులతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. చీరాల అగ్నిమాపక కేంద్రం స్థాయిని పెంచి అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారిని నియమించినా వసతులు మాత్రం ఏర్పడలేదు.

నూతనంగా మూడు ఉన్నత పాఠశాలలు

12 ఆదర్శ పాఠశాలలు

జె.పంగులూరు: పంగులూరు మండలంలో రానున్న విద్యా సంవత్సరంలో నూతనంగా 3 ఉన్నత పాఠశాలలు, 12 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. మండలంలోని రేణింగవరం, కొండమూరు, కోటపాడు గ్రామాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా చేయనున్నారు. పంగులూరులో 2 పాఠశాలలు, అలవలపాడులో 2 పాఠశాలలు, రామకూరు, కొండమంజులూరు, ముప్పవరం, రేణింగవరం, కొండమూరు, కోటపాడు, కల్లంవారిపాలెం, బూదవాడ గ్రామాల్లో ఒక్కొక్కటి వంతున ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ఆయా గ్రామాల విద్యార్థుల సంఖ్యను అనుసరించి 10 చోట్ల ఫౌండేషన్ పాఠశాలలు, 14 చోట్ల బేసిక్ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. బేసిక్ పాఠశాలలు 5 వ తరగతి వరకు కొనసాగనుండగా, ఇందులో ఇద్దరు ఉపాధ్యాయుల నియామకం ఉంటుంది. ఫౌండేషన్ పాఠశాలలు ఒకటి, రెండు తరగతులు మాత్రమే నిర్వహించనుండగా విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకటి, ఇద్దరు ఉపాధ్యాయులు ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యా శాఖ అధికారులు తెలిపారు. నూజిళ్లపల్లి, తూర్పు కొప్పెరపాడులు గ్రామాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలు యథావిధిగా కొనసాగుతాయని మండల విద్యాశాఖ అధికారి కే నాగభూషణం, జి. వీరాంజనేయులు తెలిపారు. మండలంలో 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, 12 ఆదర్శ పాఠశాలలు, 14 బేసిక్ పాఠశాలలు, 10 ఫౌండేషన్ పాఠశాలలు కొనసాగనున్నాయి. వీటితోపాటు ముప్పవరం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, రామకూరులోని ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగుతాయని విద్యాశాఖ అధికారులు తెలియజేశారు.

ఆటోబోల్తా ఓ మహిళ మృతి

ముగ్గురికి గాయాలు

చినగంజాం : ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఓ మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి గాయలైన సంఘటన చినగంజాం మండల పరిధిలోని తిమ్మసముద్రం సైఫన్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన పలువురు మహిళా కూలీలు ఇంకొల్లు మండల పరిధిలోని పావులూరు గ్రామంలో మిర్చి పంట పనులకు గత మూడు నెలలుగా ప్రతి రోజు వెళుతున్నారు. రోజు మాదిరిగానే కడవకుదురు గ్రామం నుంచి గురువారం ఉదయం 5 గంటల ప్రాంతంలో బయలుదేరి వెళుతున్న వారి ఆటో ఇంకొల్లు రోడ్డులోని తిమ్మసముద్రం సైఫన్ వద్దకు వెళ్ళే సరికి ఆటో హ్యాండిల్ అకస్మాత్తుగా బిగుసుకొని పోవడంతో పక్కనే కుడివైపు ఉన్న పొలాల్లోకి దూసుకొని వెళ్ళి బోల్తా కొట్టింది. ఆ సంఘటనలో నలుగురికి గాయాలు కాగా వారిలో నక్కల సోవమ్మ (79)ను తీవ్ర గాయలు కావడంతో 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఆమెతో పాటు ప్రయాణిస్తున్న బత్తుల కమలమ్మ తలకు గాయం కాగా ఒంగోలు కిమ్స్‌కు, కొండేపు శేషమ్మ, డ్రైవర్ గొల్లపూడి వెంకటేశ్వర్లుకు గాయాలు కావడంతో వైద్యచికిత్స నిమిత్తం చీరాల తరలించారు. బాధితురాలు కొండేపు శేషమ్మ అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు.

గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు జైలు

బాపట్ల: గంజాయి కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్ష, పదివేలు జరిమానా విధిస్తూ గుంటూరు మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఏ.ఎల్ సత్యవతి గురువారం తీర్పు చెప్పారు. బాపట్ల జిల్లా చందోలు పోలీసుస్టేషన్ పరిధిలోని రసూల్‌పేటకు చెందిన షేక్ నజీర్‌బాషా నివాసంలో 2017 నవంబరు 19న అప్పటి చందోలు ఎస్ఐ చెన్నకేశవులు దాడులు నిర్వహించగా 470 గ్రాములు గంజాయి దొరికిందని కేసు నమోదు చేశారు. ఈమేరకు విచారణ చేపట్టిన ఈ కేసులో నజీర్‌బాషా, మారెడ్డి రోహిత్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంలకు శిక్షపడింది. గుంటూరు మొదటి అదనపు జిల్లా కోర్టులో కేసు విచారణకు రాగా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు సూచనలతో బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ పర్యవేక్షణలో చందోలు ఎస్సై శివకుమార్, కోర్ట్ లైజనింగ్ ఏఎస్ఐ ఉప్పల భాస్కర్ ద్వారా సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఏపీపీ వజ్రాల రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించి ముద్దాయిలపై మోపబడిన నేరాన్ని తగిన సాక్ష్యాలతో రుజువు చేయడంతో గుంటూరు మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఏ.ఎల్ సత్యవతి గురువారం ముగ్గురు నిందితులకు 3 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10,000 నగదు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈమేరకు ఎస్పీ తుషార్ డూడీ పోలీసులను అభినందించారు.

సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి ప్రభుత్వంతో ఒప్పందం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి గురువారం ఒప్పందం జరిగింది. డీఎంఈ డాక్టర్ నరసింహం భవన నిర్మాణ దాత ప్రముఖ పారిశ్రామిక వేత్త తులసి రామచంద్రప్రభు తనయుడు తులసి యోగీష్ చంద్రతో ఒప్పందం చేసుకున్నారు. విజయవాడ డీఎంఈ కార్యాలయంలో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరు జీజీహెచ్ హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు రూ. పది కోట్ల వ్యయంతో సర్వీస్ బ్లాక్ నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు ముందుకు వచ్చారు.

జనవరిలో జీవో విడుదల

సర్వీస్ బ్లాక్ నిర్మాణం పూర్తి చేసేందుకు తులసి రామచంద్ర ప్రభుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జనవరిలో జీవో నెంబర్ 11 ప్రభుత్వం రిలీజ్ చేసింది. దీనికి సంబంధించి అన్ని అనుమతులు పూర్తి చేసుకొని గురువారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డి ఎస్ వి ఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ యోగీష్ చంద్ర విజయవాడ డీఎంఈ కార్యాలయంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. సర్వీస్ బ్లాకు నిర్మాణ కార్యక్రమాలు వెంటనే మొదలు పెడతామని యోగీష్ చంద్ర తెలిపారు. భవన నిర్మాణం 18 నెలల్లోగా పూర్తి చేసి అందిస్తామన్నారు. ఈసందర్భంగా యోగీష్ చంద్రను డీఎంఈ డాక్టర్ నరసింహం, డాక్టర్ యశస్వి రమణ సన్మానించారు. కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్, వివేక్ పాల్గొన్నారు.


యోగీష్ చంద్రను సన్మానిస్తున్న డీఎంఈ డాక్టర్ నరసింహం, డాక్టర్ యశస్వి రమణ

హత్య కేసులో ఒకనికి జీవిత ఖైదు

నరసరావుపేటటౌన్: వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తిని హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వేమవరం గ్రామానికి చెందిన వడితే నాగేశ్వరరావు నాయక్ కు జీవిత ఖైదు, పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ గురువారం తీర్పు వెలువరించారు. హతుడు షేక్ ఖాదర్ బాబా(32) నిందితుడు నాగేశ్వరావు నాయక్ లది ఒకే గ్రామం. ఖాదర్ బాబా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో చికెన్ షాపు నిర్వహిస్తూ జీవిస్తుంటాడు. ఈ నేపథ్యంలో మురికిపూడికి చెందిన ఓ మహిళతో ఆయన సన్నిహితంగా ఉంటున్నాడు. సదరు మహిళతో నిందితుడు నాగేశ్వరరావునాయక్ కూడా గతంలో సన్నిహితంగా మెలిగాడు. సదరు మహిళతో ఖాదర్ బాబా పరిచయం అయిన పిదప ఆమె నిందితుడు నాగేశ్వరరావునాయక్‌ను దూరంగా పెట్టింది. కక్ష పెంచుకొని 2019 జులై 23వ తేదీ రాత్రి సమయంలో మురికిపూడి గ్రామంలో చికెన్ షాప్ లో నిద్రిస్తున్న ఖాదర్ బాబాను నాగేశ్వరరావు కత్తితో మెడ భాగంలో నరికి హతమార్చాడు. ఈ మేరకు మృతుడి భార్య షేక్ షాహిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేశి రెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు.

రైతు శాస్త్రవేత్తలు, మెంటార్ ఇంటర్న్‌ల ఎంపిక

దరఖాస్తులు ఆహ్వానించిన జిల్లా వ్యవసాయ అధికారి

కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్, జర్మనీ ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ గ్రామాల రైతు సేవ కేంద్రాల పరిధిలో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్ ఇంటర్న్‌ల ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో కొల్లిపర, గుంటూరు రూరల్ మండలాల్లో మెంటార్ ఇంటర్న్‌లు ఉన్నారని పేర్కొన్నారు. పెద్ద కొండూరు (దుగ్గిరాల మండలం), చివలూరు (కొల్లిపర మండలం), ముట్లూరు (వట్టిచెరుకూరు మండలం), నారాకోడూరు (చేబ్రోలు మండలం)లో రైతు శాస్త్రవేత్తలు శిక్షణ పొందుతున్నారని వెల్లడించారు. మిగిలిన ప్రతి ప్రకృతి వ్యవసాయ మండలానికి ఒక మెంటార్ చొప్పున, ప్రకృతి వ్యవసాయ గ్రామంలో ఉన్న ప్రతి రైతు సేవా కేంద్రానికి ఒక రైతు శాస్త్రవేత్త చొప్పున దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోపు జిల్లా ప్రకృతి వ్యవసాయం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాలుగు సంవత్సరాల కోర్స్ కాలంలో వీరికి గౌరవ వేతనం ఇస్తామని తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డిగ్రీ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు శనివారంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్హతలివీ...

రైతు శాస్త్రవేత్త కోర్సు ప్రవేశానికి విద్యార్హత ఇంటర్మీడియట్ లేదా అంతకంటే ఎక్కువ, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, హార్టీకల్చర్ చదివి ఉండాలన్నారు. అభ్యర్థి సంబంధిత ఆర్ఎస్‌కేకి చెంది ఉండాలన్నారు. మూడు సంవత్సరాలు ప్రకృతి వ్యవసాయం చేసి ఉండాలన్నారు. మెంటార్ ఇంటర్న్ ఎంపికకు ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువ చదివి ఉండాలన్నారు. రైతు శాస్త్రవేత్త పోస్టుకు సొంత భూమి కలిగి ఉండాలని, లేని పక్షంలో సుమారు 1.20 ఎకరాలు కౌలుకు తీసుకొని ఉండాలని వెల్లడించారు. మెంటార్ ఇంటర్న్ పోస్టుకు సొంత భూమి కలిగి ఉండాలని, భూమి లేని వారు నాలుగు సంవత్సరాల పాటు లీజుకు తీసుకున్న భూమి ఉండాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి జీవిత భాగస్వామి లేదా కుటుంబం తప్పనిసరిగా మద్దతు ఇవ్వాలని ఆయన వివరించారు. వయస్సు 25 - 35 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాల సడలింపు ఉంటుందని చెప్పారు. వివరాలకు 70958 81347 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

ముగిసిన సలహా మండలి సమావేశం


సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందు గత రెండు రోజులుగా జరుగుతున్న వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం గురువారంతో ముగిసింది. సమావేశంలో ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలు పంటల్లో పరిశోధనలు, సాధించిన ప్రగతి, నూతన టెక్నాలజీ, మినీకిట్లు వంటి అంశాలపై చర్చించి సమాచారాన్ని అందించారు. యాంత్రీకరణపై శాస్త్రవేత్తలతో ప్రత్యేక చర్చా కార్యక్రమం, గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. వరి పంటలో బీపీటీ 5204 నాణ్యత కలిగిన సన్నగింజ రకాలు ఎగుమతికి అనువైనవని, 7 మిల్లీ మీటర్ల గింజ పొడవుగల వరి రకాలు, కలర్డ్ వరి రకాలపై పరిశోధనలు చేయాలని, అధిక దిగుబడిని ఇచ్చే తక్కువ ఎత్తుగల మొక్క జొన్న, జొన్న, హైబ్రిడ్స్ అపరాలలో కలుపు యాజమాన్యం, శనగలో పోస్ట్ ఎమర్జెన్స్ కలుపు మందులు, కాండం తొలిచె పురుగులు, గజ్జి తెగులు యాజమాన్యం, తెగుళ్లను తట్టుకునే మినుము రకాలపై పరిశోధనలు చేపట్టాలని పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. పత్తిలో గులాబీ రంగు పురుగు యాజమాన్యంపై, ట్రాష్ షెడ్డర్ ద్వారా పంట వ్యర్థాలు వినియోగం వటి అంశాలపై అవగాహన రైతులకు పెంచాలని విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివన్నారాయణ తెలిపారు. చెరకు విస్తీర్ణం క్రమేపీ తగ్గిపోతున్న సందర్భంగా డ్రయ్యర్లు రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. చెరకులో యాంత్రీకరణను పెంచి కూలీల ఖర్చు తగ్గించినపుడే పంటలో ఆశించిన లాభం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లల్లో కారం కొట్టి చైన్ స్నాచింగ్

మంగళగిరి టౌన్ : ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలి కళ్లల్లో కారం కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును దోచుకు వెళ్లిన సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం మంగళగిరి నగర పరిధిలోని రత్నాల చెరువు వద్ద సరోజని అనే వృద్ధురాలు ఒంటరిగా జీవనం సాగిస్తోంది. బుధవారం రాత్రి ఇంట్లో అన్నం తింటుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి కళ్లల్లో కారం కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారపు గొలుసును లాక్కుని పారిపోయాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో పక్కన నివాసముంటున్న వారు అక్కడకు చేరుకునే సరికి ఆ వ్యక్తి పారిపోయాడు. కాసేపటికి తేరుకున్న ఆమె మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంగారం గొలుసు సుమారు 18 గ్రాములు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భట్టిప్రోలు వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాపట్ల జిల్లా అద్దేపల్లి గ్రామానికి చెందిన కనపర్తి సందీప్(19) ఐటీఐ చదువుతున్నాడు. బుధవారం రాత్రి భట్టిప్రోలు సమీపంలో రేపల్లె నుంచి కాచిగూడ వెళుతున్న డెల్టా ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని గురువారం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. పోస్టమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్టు తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని జీఆర్పీ ఎస్ఐ జి. వెంకటాద్రి తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో 1,227 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 821, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,900. గరిష్ఠ ధర రూ.12,250, మోడల్ ధర రూ.11,725. కాయలు 406, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,900. గరిష్ఠ ధర రూ.12,250, మోడల్ ధర రూ.11,725, మొత్తం 920.250 క్వింటాళ్లు అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.


యార్డులో 1,18,944 మిర్చి బస్తాలు విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,12,028 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,18,944 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 51,104 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

హాస్పిటల్స్‌కు ఫైర్ నిబంధనలను సవరించండి

ఫైర్ డీజీకి ఐఎంఏ విజ్ఞప్తి

గుంటూరు మెడికల్: రాష్ట్రంలో క్లినిక్స్, చిన్న, మధ్యతరహా ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ విషయంలో ఫైర్ ఎన్ఓసీ చాలా సమస్యగా ఉందని, ఫైర్ నిబంధనలను కొన్ని సవరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్‌ను కోరింది. విజయవాడలోని ఫైర్ సర్వీసెస్ కార్యాలయంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ ఆధ్వర్యంలో గురువారం మాదిరెడ్డి ప్రతాప్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 'నేషనల్ ఫైర్ సేఫ్టీ వీక్' సందర్భంగా ఐఎంఏ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్యులకు జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి.నందకిషోర్, ఐఎంఏ ఫైర్ సేఫ్టీ కమిటీ చైర్మన్ డాక్టర్ సి.శ్రీనివాసరాజు, ఫైర్ ఎన్ఓసీ విషయంలో ఎదురవుతున్న సమస్యలను డీజీ దృష్టికి తీసుకువెళ్లారు. క్లినిక్స్, చిన్న, మధ్యతరహా ఆసుపత్రిలో కూడా భారీ అగ్నిమాపక పరికరాలు అమర్చుకోవాలనడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. వీటివల్ల ఆర్థిక భారం తప్ప ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. మాదిరెడ్డి ప్రతాప్ మాట్లాడుతూ వైద్యులు ఫైర్ ఎన్ ఓసీ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తప్పక కృషి చేస్తానన్నారు. డీజీని కలిసిన వారిలో ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మోటూరు సుభాష్ చంద్రబోస్, ఐఎంఏజాతీయ యాక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ పి. ఫణిధర్, కోశాధికారి డాక్టర్ టి.కార్తీక్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి.సేవకుమార్, డాక్టర్ డి.అమరలింగేశ్వర రావు తదితరులు ఉన్నారు.


డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌ను కలిసి సమస్య తెలియజేస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్